
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పరీక్షకు ముందు...

- పరీక్ష సామగ్రి (పెన్నులు, రీఫిల్స్, పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్, స్కేల్, తదితరాలు), హాల్‌టికెట్‌ను ముందు రోజు రాత్రే సిద్ధంగా పెట్టుకోవాలి. చివరి నిమిషంలో వాటి కోసం వెతుక్కునే పరిస్థితి రాకూడదు.
- మంచి నీళ్ల సీసాను వెంట తీసుకెళ్లడం మంచిది. ఒకవేళ పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోతే బయట వదిలేయవచ్చు. అనుమతిస్తే మంచిది. కొన్ని చోట్ల నీరు సరైనది కాకపోతే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది.
- సాయంత్రం లేదా రాత్రి పూట త్వరగా జీర్ణమయ్యే అహారం తీసుకోవాలి. మసాలాలతో కూడిన ఆహారం వల్ల నిద్ర సరిగ్గా ఉండదు.
- పరీక్షకు వెళ్లేటప్పుడు కూడా పోషకాహారం తీసుకోవాలి. నూనెతో చేసిన పదార్థాలు తీసుకోకూడదు. వాటి వల్ల దాహం ఎక్కువై పదేపదే నీరు తాగాల్సి రావచ్చు.
- పరీక్ష హాలుకు నిర్దేశిత సమయానికన్నా అరగంట ముందు చేరుకోవాలి. మార్గమధ్యంలోని ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇంటి నుంచి ముందుగానే బయలుదేరాలి.
- పరీక్షా కేంద్రం, పరీక్షా హాలులోకి వెళుతూ కూడా చదవడం మంచిది కాదు. అలా చదివింది గుర్తు కూడా ఉండదు. ఏదైనా గుర్తు రాకపోతే పట్టించుకోకుండా వదిలేయాలి తప్ప ఆందోళన పడకూడదు.



విజయీభవ..

- ఒత్తిడికి గురి కావద్దు..
- పరీక్షలు బాధ్యతగా రాయాలి, భయంతో కాదు..
- 'పది' అత్యంత కీలకం
- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైనది. పదో తరగతి మార్కులు జీవితాంతం అక్కరకు వస్తూనే ఉంటాయి. విద్యార్థి దశలో వాటి విలువ తెలియకపోయినా తదనంతర జీవితంలో తెలిసి వస్తుంది. చదువుకున్న ప్రతి ఒక్కళ్లూ జీవితంలో వెనక్కు వెళ్లి పదో తరగతి మరోమారు చదివే అవకాశం వచ్చి, మంచి మార్కులు సాధించే అవకాశం వస్తే బాగుండు అని అనుకోని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అటువంటి కీలకమైన పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పబ్లిక్ పరీక్షలని, జీవితానికి ఉపయోగపడే పరీక్షలని, టెన్త్‌లో మంచి మార్కులు వస్తేనే ఇంటర్ చదివేందుకు మంచి కాలేజీలో అడ్మిషన్ దొరుకుతుందని...ఇలా రకరకాల మాటలతో విద్యార్థులు ఒత్తిడికి లోనవడం సహజం. ఆ ఒత్తిడిని జయిస్తేనే 'పది'లంగా బయటగలమని, పరీక్షలు రాసేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని విద్యాధికారులు చెబుతున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, విజయాన్ని అలవోకగా ఎలా కైవసం చేసుకోవాలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు చేయకూడనివి..

- పరీక్షలకు విద్యార్థులు సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్‌వాచ్ ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు.
- పరీక్ష కేంద్రంలో తమ వద్ద ఆన్సర్ షీటు తప్ప ఇతరత్రా పేపర్లు పెట్టుకోకూడదు.
- తమకిచ్చిన ఆన్సర్ షీట్‌ను పరీక్ష కేంద్రం బయటకు తేకూడదు.

పరీక్ష హాలులో..

- ప్రశ్నపత్రం చేతిలోకి తీసుకున్న వెంటనే గుండెల నిండా ఊపిరి పీల్చుకుని దానిని ఆసాంతం బాగా చదవాలి.
- మొదటి పది నిమిషాలు ప్రశ్నలు చదవడానికి, అవసరమైన ప్రశ్నలకు చుక్కలు పెట్టుకోవడానికి కేటాయించాలి.
- చివరి పది నిమిషాలు పేపర్ అంతా ఒకసారి చూసుకోవడానికి కేటాయించాలి.
- మొదట రాసే ప్రశ్నలకు ఎక్కువ సమయాన్ని కేటాయించకూడదు. మిగతా ప్రశ్నలకు సరైన సమయం ఉంటుందో లేదో చూసుకోవాలి.
- మొదట బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- చివరి ప్రశ్న కూడా కాస్త బాగా తెలిసినదే రాయాలి. చివరిలో వచ్చీ రాని నాసిరకం ప్రశ్నను ఎంచుకోకూడదు.
- సమాధానాలను రాసేటప్పుడు పెద్ద పేరాగ్రాఫ్‌లా కాకుండా పాయింట్‌ల రూపంలో రాయాలి.
- హెడ్డింగ్స్, సబ్‌హెడ్డింగ్స్ పెట్టడం వలన పేపర్‌లు దిద్దే వారికి సులభంగా ఉంటుంది.
- ప్రశ్న అడిగిన విధానాన్ని బట్టి సమాధానం ఉండాలి. ఉదాహరణకు పోల్చి చూడండి అంటే పట్టిక రూపంలో సమాధానం రాయాలి. వర్ణించుము అంటే పేరాగ్రాఫ్‌గా రాయాలి. లెక్కించుము అంటే పాయింట్‌ల వారీగా రాయడం మంచిది.
- ప్రశ్నపత్రం కష్టంగా ఉందని అనిపిస్తే ఎంతో కొంత గుర్తుకొచ్చింది రాయాలే తప్ప ప్రశ్నలను వదిలేయకూడదు.
- పేపరు సులభంగా ఉంటే మంచి విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు సులభంగా ఉన్న వాటి కంటే ఇతరులు రాయలేరు అన్న ప్రశ్నలకు సమాధానాలు రాయడం వల్ల పేపరు దిద్దేవారికి కాస్త ఆసక్తి కలుగుతుంది. లేదంటే బాగా చదివిన వారికి, చదవని వారికి ఒకే రకంగా మార్కులు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- పేజీలను నింపేందుకు అనవసర విషయాలను రాయకూడదు.
- అనుకున్నవన్నీ రాసేసిన తరువాత సమయం ఉందని అనిపిస్తే ఛాయిస్ ప్రశ్నలకు కూడా సమాధానాలు రాయాలి.
- పరీక్ష హాలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సరే తట్టుకోవాలి.
- పరీక్ష అయిపోయిన తర్వాత దాని గురించి ఎవరితోనూ చర్చించకూడదు. ఫలానా ప్రశ్నకు సరిగ్గా రాయలేకపోయానని చింతించకూడదు. తరువాత పరీక్షపై దృష్టి సారించాలి.

ఒత్తిడికి లోనుకాకూడదు..



పరీక్షా కాలంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకూడదు. విద్యార్థులకు అధికజ్వరం, పల్స్‌పడిపోవడం, కండరాల నొప్పులు, తీవ్రమైన నిస్సత్తువ, వాంతులు, విరేచనాల వంటి లక్షణా లు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే పరీక్షలు బాగా రాయగలరు.

- సుబ్బారెడ్డి, బద్వేలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి..



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా, పరీక్షలు రాయాలి. ప్రతి మండలానికి ఒక 104 వాహనాన్ని అందుబాటులో ఉంచుతాము. విద్యార్థులు సమయానికి పరీక్షకు హాజరయ్యేందుకు ఉచిత ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశాము. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి.

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..



జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాం. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలి.

- షంషుద్దీన్, డీఈఓ

స్పాట్ వాల్యూయేషన్‌కి అధ్యాపకులను రిలీవ్ చేయండి

- ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్‌కు నియమితులైన అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆర్ఐ ఓ బి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఇంగ్లీష్, తెలుగు, హింధీ, సివిక్స్, గణిత సబ్జెక్టులకు సబంధించిన చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా రిలీవ్ చేయాలన్నారు. అధ్యాపకులను రిలీవ్ చేయని కళాశాలలపై బోర్డు ద్వారా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సోమవారం స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు హాజరు కావాలన్నారు. అనంతరం వాల్యూయేషన్‌కి సంబంధించి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- కేంద్రాలు 161, విద్యార్థులు 27800
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు నిషేధం
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 17 నుంచి 31 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 161 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 27,800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 14,330 మంది, బాలికలు 13,470 మంది ఉన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు అనుమతించరు. కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అధికా రులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సౌకర్యం సహా వెలుతురు, గాలి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. 161 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 161 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1677 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 7ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షిస్తారు. ఈ ఏడాది సమస్యాత్మకంగా ఉన్న ఆరు కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్సు కేంద్రాలను మూసివేయించనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

39 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు

జిల్లాలో 39 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 2353 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మార్చి 17 నుంచి 28 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి.

సమస్యాత్మక కేంద్రాలు ఇవే...

జిల్లాలో సమస్యాత్మకమైన ఆరు కేంద్రాలను విద్యాశాఖ గుర్తించింది. వాటిలో కమలా పురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బి.మఠం జడ్పీ హైస్కూల్, బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండాపురం జడ్పీ హైస్కూల్, వేంపల్లె జడ్పీ బాలికోన్నత పాఠశాల, సింహాద్రిపురం జడ్పీ హైస్కూలు ఉన్నాయి. ఈ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

విద్యార్థులు హాల్ టికెట్లు చూపితే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. పరీక్ష సమయానికి కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు సర్వీసులు నడపనున్నారు.

కంట్రోల్ రూమ్

ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9441683500, 7358302380 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలి. 24 గంటలు ఈ నెంబర్లు అందుబాటులో ఉంటాయి.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

అమరజీవి త్యాగనిరతిని ప్రతి తెలుగువాడు గుర్తుంచుకోవాలి : ఎస్పీ

కడప క్రైం. మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం జన్మించిన వారిలో పొట్టిశ్రీరాములు అగ్రగణ్యుడని.. ఆయన త్యాగనిరతిని ప్రతి తెలుగువాడు గుర్తు పెట్టుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు 124వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్రాసు రాజధానిగా ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు వారి కష్టాలపై చలించి, భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరులయ్యారన్నారు. పొట్టిశ్రీరాములు మరణానంతరం ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, టైటాస్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అందరికీ ఆదర్శనీయం

కడప కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పొట్టి శ్రీరాములు జయంతి సంస్మరణసభ నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58రోజుల పాటు నిరహార దీక్ష చేసి, చివరికి జాతి కోసం ప్రాణాల్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగు వారని చెప్పుకోవడం గర్వ కారణమన్నారు. కార్యక్రమానికి ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమరజీవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
కడప	6.31	5.07
ప్రొద్దుటూరు	6.32	5.11

పులివెందులలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న కడప, ప్రకాశం జట్లు



7

ముగిసిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

- కడప బాలురు, శ్రీకాకుళం బాలికల విజయఢంకా

బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు అరెస్టు

7

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

వివరాలు... 7లో

ప్రజల సమస్యలు పట్టవా.. జగన్ !

- ప్రతిపక్ష హోదా రాదని తెలిసినా.. అసెంబ్లీకి వెళ్లవు
- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గెలిచిన 11సీట్లతో అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని సాకులు చెబుతూ అసెంబ్లీకి వెళ్లవు.. ప్రజల సమస్యలపై చర్చించవు.. కనీసం పులివెందులలో సమస్యల గురించి పట్టించుకోవు.. అంటూ మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. 60 వేల మెజార్టీతో ప్రజలు గెలిపిస్తే సమస్యలు పట్టించు కోనప్పుడు ఆ పదవలో కొనసాగడం ఎందుకని, రాజీనామా చేస్తే వేరొకరికి అవకాశం వస్తుందన్నారు. వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే అసెంబ్లీకి వెళ్లకుండా.. చిన్నపి లాడిలా ప్రతిపక్ష హోదా కోసం పట్టుబడుతున్నారని ఎద్దేవా చేశారు. పులివెందులలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు తదితర ఎన్నో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతురన్నారని.. వాటిపై ఎమ్మెల్యేగా అడగాల్సిన బాధ్యత లేదా అని మండి పడ్డారు. ఇక వేంపల్లెలో అవినీతి ఆరోపణలతో ఈఓ సస్పెండ్ కావడంతో పారిశుధ్యం, నీటి సమస్య గురించి పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆపేదెవర్రా..

- బ్లాక్ లిస్టులో ఉన్నా.. యథేచ్ఛగా నిర్మాణాలు
- ఇరిగేషన్ స్థలంలోనూ వెంచర్ల కోసం రోడ్లు
- చేష్టలుడిగి చూస్తున్న కార్పొరేషన్

(కడప-ఆంధ్రజ్యోతి): అధికార యంత్రాంగాన్ని.. నేతలను మేనేజ్ చేసే సత్తా ఉండాలి కానీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా యథేచ్ఛగా తాము అనుకున్న పని చేసుకో వచ్చు. వైసీపీ హయాంలో కడప చుట్టూ ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండానే వెంచర్లు వేశారు. 93 లేఅవుట్లను అప్పట్లో బ్లాక్ లిస్టులో పెట్టారు. అనుమతులు లేని లేఅవుట్లపై టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా అలుపులేని పోరాటం చేసింది. సీన్ కట్ చేస్తే... ఇప్పుడు యథేచ్ఛగా అనుమతులు లేని లేఅవుట్లులో కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కడపలోని అక్రమ లేఅవుట్లపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిలు ప్రత్యేక దృష్టి పెట్టారు. టౌన్ ప్లానింగ్ అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేసి అమాయకులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ లేఅవుట్లపై డీటీసీపీకి ఫిర్యాదు చేయడంతో గుంటూరు నుంచి టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు అనుమతి లేని లేఅవుట్లను పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి పంపించారు. ఇక రామాంజనేయపురంలో నలుగురు కార్పొరేటర్లు వేసిన లేఅవుట్‌లో కాల్వ స్థలం ఉందంటూ ఇరిగేషన్ అధికారులు లేఅవుట్‌లో కాల్వస్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి కాల్వను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇప్పుడు బ్లాక్‌లిస్టులో ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు జరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది.

కడప నగరంలోని బళ్లారిరోడ్డులో ఓ స్కూలు వద్ద సుమారు ఐదెకరాల్లో వెంచర్ వేశారు. ఇది కేసీ కెనాల్ సమీపంలో ఉండటంతో అనుమతులు తీసుకుని లేఅవుట్ వేయాలి. బఫర్ జోన్ వదలాలి. లేఅవుట్‌కు అనుమతి లేకపోవడంతో బ్లాక్‌లిస్టులో పెట్టారు. అయితే మొత్తం విస్తీర్ణమే కాకుండా కొంత విస్తీర్ణంలోనే టౌన్ ప్లానింగ్ అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. అయితే ఇక్కడ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతుండడం గమనార్హం. ఇక్కడ ఇళ్లకు హౌస్ నెంబరు కూడా కేటాయించడం విశేషం. బ్లాక్‌లిస్టులో పెట్టిన వాటికి పన్ను వేయకూడదు. పన్ను వేస్తే ఆటోమేటిక్‌గా ఇంటి నెంబరు కేటాయిస్తారు. అయితే ఇక్కడ నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతుండడం గమనార్హం. గూడూరు గ్రామ రెవెన్యూ పొలంలో పులివెందుల రోడ్డు రహదారిలో కేసీ కెనాల్ రహదారిని ఆక్రమించి కేసీ కెనాల్ పక్కనే లేఅవుట్ వేశారు. ఇక్కడ సెంటు రూ.10లక్షల నుంచి రూ.12లక్షలుకు నిర్ణయించారు. అయితే ఇక్కడ కేసీ కెనాల్‌లోనే రహదారి నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు రావడంతో కేసీ కెనాల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత అలాగే వదిలేశారంటారు.

సెటిల్‌మెంటు చేసుకుంటున్నారు...

నగరంలో అనుమతులు లేకుండా ప్లానింగ్‌కు విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనిపించకుపోడంతో తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నగరంలో వంద సచివాలయాలున్నాయి. ప్రతి సచివాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ఉంది. ఆ పరిధిలో ఎక్కడెక్కడ కట్టడాలు జరిగాయో కనుక్కోవడం చాలా ఈజీ. అయితే అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు లేని నిర్మాణాల వద్దకు వెళ్లి సెటిల్‌మెంటు చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. కాగా, ఈ విషయమై సిటీ ప్లానర్ వై.వెంకటరమణ ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ... అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలు చేపడితే నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని వెల్లడించారు.



బళ్లారి రోడ్డులో ఉన్న బ్లాక్‌లిస్టు లేఅవుట్‌లో నిర్మాణాలు



బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు అరెస్టు

● రూ. 1,20,000 నగదు , ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం



క్రికెట్ బుకీల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ ఎస్‌ఐలు

ప్రొద్దుటూరు , మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు రావులకొల్లు నాగేంద్రను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి అరెస్టయిన నలుగురు క్రి కెట్ బుకీల వివరాలు వెల్ల డించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చాంపియన్‌షిప్ ట్రోఫీ సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డు లోని పాలకేంద్ర సెక్యూరిటీ రూం దగ్గర నలుగురు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలు నిర్వహిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ. 1,20,000 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో ప్రొద్దుటూరు పట్టణం శ్రీరాం నగర్‌కు చెందిన రావులకొల్లునాగేంద్ర (42), వివేకా నంద కాలనీకి చెందిన గాలిపోతుల ఆనంద్ (21), శ్రీరాంనగర్‌కు చెందిన రావులకొల్లు మనోజ్ (23), శ్రీరాంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బొమిశెట్టి శివప్రసాద్ (26) ఉన్నారని తెలిపారు. వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోవా మద్యం పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, మద్యం

ప్రొద్దుటూరు , మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఇతర ప్రాంతాలనుంచి ప్రొద్దుటూరుకు కారులో గోవా మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్ స్పెక్టర్ నీలకంఠేశ్వర రెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డిలు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా కాటం వీరేంద్ర ఉప్పు రామ కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు కారులో 18 (750ఎంఎల్) గోవా మద్యం ఫుల్ బాటిళ్లను తీసుకోని వస్తుండగా పట్టుబడ్డారు. గోవా మద్యం తోపాటు కారును స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పట్టపగలే భారీ చోరీ

● 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ



ధ్వంసమైన బీరువా, చెల్లాచెదురుగా దుస్తులు

గుర్రంకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన ఓ కుటుంబం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహ రించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్ప గారి పల్లెకు చెందిన మునిస్వామి, గంగులమ్మ దంపతులకు వ్యవసాయం జీవనాధారం. వీరి ఇల్లు గ్రామంలో చివరన ఉంది. ఆదివారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లిన వారు సాయం కాలం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి ముఖ ద్వారం తెరచి ఉండడంతో, లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసమై, అందులోని దుస్తులు ఇతర సామగ్రి చెల్లాచెదురుగా కింద పడి ఉండడం కనిపించింది. బీరువాలోని లాకర్‌ను పరిశీలించా అందులోని నగలు, బంగారం అపహరణకు గురైనట్లు తేలింది. 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదును దుండగులు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్/రామసముద్రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు చౌడేపల్లె ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మదనపల్లెలో ఉంటూ మండలంలోని చీకలబైలు హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న వెంకటరమణ(55) ఆదివారం చౌడేపల్లెలో తమ బంధువుల గృహ ప్రవేశానికి వెళు తుండగా చిత్తూరు జిల్లా బోయకొండ రోడ్డులో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన పడిపోయడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడిని స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించార చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



ఉరి వేసుకున్న లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలోని హైపర్‌టెన్షన్ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లాలోని దొనగిరి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(35) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం రైల్వే కోడూరు మండలం కే. బుడుగుంటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ని విద్యానగర్‌కు వచ్చాడు. వివిధ రకాల కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమని తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేణిగుంట రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న మౌలాలి

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. బి.కొత్తకోట మండలం, గోళ్లపల్లె గ్రామం, కనికలతోపునకు చెందిన షేక్ మౌలాలి(35) న్యూస్ పేపర్ బాయ్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం రోడ్డు పక్కన వెళు తున్న అతను కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు బి.కొత్తకోట పోలీసులు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బాలికల గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుగుణమ్మ తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకుంటే ప్రవేశపరీక్ష ఉంటుందని, ప్రతిభ ఉన్న వారికి సీట్లు లభిస్తాయని తెలిపారు. ఈనెల ఆఖరులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కేసీ కెనాల్ కింద రెండు కార్లు పండిస్తాం

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



ఎర్రచెరువుకు తెలుగుగంగ నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా (ఇన్‌సర్ట్) ఎర్రచెరువు వైపు ప్రవహిస్తున్న జలం

మైదుకూరు రూరల్ ,మార్చి16(ఆంధ్రజ్యోతి) :కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో రెండు కార్ల సాగుకు నీటిని అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలో వనిపెంట వద్ద నున్న ఎస్‌ఆర్ 2 నుంచి మైదుకూరు ఎర్రచెరువుకు ఆదివారంనీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన పుట్టా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంవత్సరంలో రెండు సార్లు చెరువులకు నీరు విడుదల చేశామన్నారు. శెట్టివారిపల్లె చరిత్రలో ఏ ఏడాదిలోనూ చెరువు నిండలేదని, కానీ కూటమి ప్రభుత్వంలో రెండు సార్లు చెరువును నింపామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జలాశయంలో నీరు ఉన్నా వదలకుండా పొలాలను ఎండగట్టారని, నేడు మైదుకూరు మున్సిపాలిటీలో నీరు పుష్కలంగా ఉందని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

రెండుకార్ల సాగుకు కార్యాచరణ

రాజోలి ఆనకట్ట నిర్మాణానికి సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, అయితే, నిధుల కొరత వల్ల కొద్దిగా జాప్యం జరగవచ్చునని తెలిపారు. అలగనూరు జలాశయాన్ని 3 టీఎంసీల నీటితో నింపడానికి రూ. 36 కోట్లు అవసరం అవుతుందన్నారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చ కూడా జరిగిందని, నిధుల మంజూరుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అలగనూరు జలాశయంలో మూడు టీఎంసీల నీరు నింపితే, ఏప్రిల్, మే, జూన్ నెలలో నీటిని వాడుకోవచ్చని, తద్వారా రెండు కార్లు పండించుకోవడమే కాకుండా తాగునీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్యే పుట్టా తెలిపారు.

మైదుకూరుకు నవోదయ విద్యాలయం మంజూరు

మైదుకూరు నియోజకవర్గానికి నవోదయ విద్యాలయం కావాలని గత ఏడాది సెప్టెంబరు నెలలో మంత్రి నారా లోకేశ్‌ను కోరగా ఆయన మంజూరు చేశారని, అందుకు సంబంధించిన పత్రాలను విలేకరులకు చూపించారు. నియోజకవర్గంలోని బ్రహ్మంగారిమఠంలో సుమారు 30 ఎకరాలలో ఈ పాఠశాలను నిర్మిస్తారని తెలిపారు. రాష్ట్రంలో నవోదయ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరూ మైదుకూరులోని బ్రహ్మంగారిమఠంలోని నవోదయ పాఠశాల గురించి మాట్లాడుకుంటారని తెలిపారు. నవోదయ పాఠశాలతో నాణ్యమైన విద్యతో పాటు మైదుకూరుకు మంచిపేరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, గుండం రాజు సుబ్బయ్య, ఇస్మాయిల్, కటారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్న మోదీకి ప్రజా ప్రతిఘటన తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం కడప ఆర్కే నగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సీపీఎం కడప జిల్లా కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయడం సీపీఎం భవిష్యత్ కార్యాచరణ అన్నారు. భవిష్యత్తులో దేశంలో, రాష్ట్రంలో జరిగే ఎటువంటి ఎన్నికలలోనైనా సీపీఎం పొత్తులు స్థానిక పరిస్థితుల ఆధారంగా ఉంటాయన్నారు. 2025 ఏప్రిల్ 2న నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మధురైలో నిర్వహించనున్న 24వ సీపీఎం జాతీయ మహాసభల్లో స్పష్టమైన రాజకీయ విధానం రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మేమున్నాం.. ఆందోళన విరమించండి

● విద్యార్థులకు ఏపీ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య సూచన



దీక్షా శిబిరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పశువైద్య కళాశాల విద్యార్థుల ఉపకార వేతనాలపై ప్రభుత్వంతో మేము పోరాడుతాం. మీరు ఆందోళన విరమించండి అని ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ లక్షుమయ్య (ఐఏఎస్) సూచించారు. ఆదివారం ఆయన ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డితో కలిసి పశువైద్య కళాశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అతి త్వరలో ఇంటర్న్‌షిప్‌లో అందించే ఉపకార వేతనాల మొత్తం పెంచుతూ ప్రభుత్వం జీవో తీసుకురానుంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తరపున తాము పోరాడుతామని, విద్యార్థులు ఆందోళన విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న గరివిడి, గన్నవరం, తిరుపతి వెటర్నరీ కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటామని విద్యార్థి నాయకులు చెప్పారు. దీంతో లక్షుమయ్య విజయవాడకు బయలుదేరగా, విద్యార్థులు వారి ఆందోళనను కొనసాగిస్తూ, ఇతర కళాశాలలోని విద్యార్థులతో సంప్రదింపులు చేస్తున్నారు.

వేడుకగా కనుమలో గంగమ్మ తిరునాళ్లు




ప్రత్యేకాలంకరణలో కనుమలో గంగమ్మ, బోనాలు తీసుకొస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ ఆలయంలో ఆదివారం పగలు తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వెంకరటమణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు చీర, జాకెట్లు, కుంకుమ. పసుపు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లు కట్టి, కోర్కెలను తీర్చాలని కోరారు. సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. మధ్యాహ్నం గుత్తా హరికృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

హిందువుల్లో ఐకమత్యంతో సత్ఫలితాలు

● సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల సూచన



సింహాద్రిపురం వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న స్వయంసేవకులు

సింహాద్రిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో హిందువులంతా ఏకమైతేనే ఫలితం ఉంటుందని సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, ముఖ్య అతిథి వెంకటనాథరెడ్డి, ప్రధాన వక్త పుట్టాశేషు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం 99 ఏళ్ల పూర్తి చేసుకుని శతవసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం సాయంత్రం సింహాద్రిపురంలోని జున్ను నారాయణరెడ్డి ఆయిల్ మిల్ నుంచి పుర వీధుల గుండా స్వయం సేవకులు, హిందువులు కవాతు నిర్వహించారు. అంతకంటే ముందు పులివెందుల నుంచి సింహాద్రిపురం వరకు హిందువులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల వెంబడి మహిళలు పూలు చల్లి స్వయం సేవకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వక్తలు సమావేశంలో మాట్లాడుతూ స్వయంసేవకులు ఎప్పుడూ క్రమశిక్షణతో దేశం కోసం అంకిత భావంతో పనిచేస్తారన్నారు. సంఘ్ కార్యకర్తలు పర్యావరణ పరిరక్షణ, గోరక్షణ, దేవాలయాల రక్షణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అజ్జగుట్టు వెంకటనాథరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, విజయరాఘవరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

దారి విషయంలో రెండు వర్గాల వివాదం

● పోలీసుల ప్రమేయంతో సర్దుబాటు



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ

పులివెందుల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దారి విషయంలో పట్టణంలో రెండు మతవర్గాల మధ్య వివాదం నెలకొంది. స్థానిక జెండామాన్‌వీధిలో ఉన్న పోలేరమ్మ గుడి దగ్గర ఓ మతానికి చెందిన ప్రార్థనా మందిరం ఉంది. ఆ వర్గానికి చెందినవారు గుడి వైపు ఉన్న గోడను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, స్థానికుల తో కలిసి వారిని ప్రశ్నించారు. దీంతో ఆ వర్గానికి చెందినవారు భారీగా గుమిగూడడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పట్టణ సీఐ నరసింహులు సంఘటనాస్థలానికి వెళ్లి ఇరు వర్గాలతో మాట్లాడి వివాదాన్ని సర్దుబాటు చేశారు. యథావిధిగా గోడను నిర్మిస్తేనే అక్కడి నుంచి వెళతామని బైఠాయించడంతో, ఆమేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నేడు గండిలో వివిధ హక్కుల వేలం

చక్రాయపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు పలు హక్కులకు సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలి పారు. ఇడుపులపాయ, నందిమండలం, వీరన్నగట్టుపల్లె, కుమ్మ రాంపల్లె, చక్రాయపేట తదితర ప్రాంతాలలో దేవస్థానానికి సంబం ధించిన భూముల కౌలు హక్కులకు రూ.5వేలు ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. గండి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల లీజుకురూ.10వేలు, దేవస్థానం ఆవరణలో సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణకు రూ.5 వేలు ధరావత్తు కట్టి పాల్గొనాలి. దేవస్థానంలో నిత్యన్నదానానికి కూరగాయలు సరఫరా చేసేందుకు రూ.20వేలు ధరావత్తు కట్టి పాల్గొనాలి. దేవుడి నైవేద్యం కోసం పాలు, పెరుగు సరఫరాచేసేందుకు రూ.20వేలు ధరావత్తు కట్టి పాల్గొనాలి. అలాగే ఖాళీ నెయ్యి డబ్బాలు, నిరుపయోగంగా ఉన్న వస్తువులు విక్రయించేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప నాగరాజుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా డీడీయు-జీకేవై పథకం కింద సీడాప్ సౌజన్యంతో 18-32 ఏళ్ల లోపు గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీ థెరపీవంటి కోర్సుల్లో నాలుగు నెలల శిక్షణ, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నామన్నారు. ఈ శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు, ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని, మరిన్ని వివరాలకు 9063082227 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు గ్రీవెన్స్ సెల్

కడప కలెక్టరేట్ మార్చి 16(ఆంధ్రజ్యోతి) ప్రతి సోమవారం ఉదయం 9-30గంటల నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్‌తో పాటు, కలెక్టరేట్ సభా భవన్‌లో ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపాలిటీల స్థాయిలోనిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ, మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



వెంకటరమణ, శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సి టీ ప్రైవేట్ డిగ్రీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కడప నగరం స్క్వేర్ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా రాజంపేట గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంభావు వెంకట రమణ, కార్యదర్శిగా ముద్దనూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడుగా నాగేశ్వరరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా అలీ అక్బర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్. సంజీవరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.వెంకటరెడ్డి మాజీ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పెంచలయ్య, రాజగోపాల్‌రెడ్డి, పోలా రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పి.సురేష్, విజయ్ కుమార్, మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సంజీవ రెడ్డి, నరసింహులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు.

ముగిసిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

● కడప బాలురు, శ్రీకాకుళం బాలికల విజయఢంకా



పులివెందులలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న కడప, ప్రకాశం జట్లు

పులివెందుల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగిన 34వ అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పులివెందుల లోని వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో 13జిల్లాల బాల, బాలికల జట్లు తలపడ్డాయి. చివరి ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం నిర్వహించగా కడప వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో కడప బాలుర జట్టు విజయఢంకా మోగించింది. అలాగే శ్రీకాకుళం-అనంతపురం మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం బాలికల జట్టు విజయఢంకా మోగించింది. విజేతలకు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, కడప జిల్లా అసోసియేషన్ ప్రతినిధుల చేతులమీదుగా కప్‌లు అందించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్, కొండయ్య, కోచ్ శ్రీధర్‌లు పాల్గొన్నారు. మొట్టమొదటి సారిగా పులివెందులలో అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలు విజయవంతం అయిన సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

రేపు పీఎఫ్ ఆఫీస్ ఎదుట పింఛనర్ల ధర్నా

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఈపీఎఫ్ పింఛనర్లకు కనీసం పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని కడప పీఎఫ్ ఆఫీసు ఎదుట ఈనెల 18న ఉదయం 10గంటలకు ధర్నా నిర్వహి స్తున్నట్లుపింఛనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అన్నివర్గాల ప్రజలపై భారాలు మోపుతున్నారని, నిత్యావసర వస్తువులు ధరలు,గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పింఛన్ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో నీటి సమస్య తీవ్రమవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నారు. రాజీవ్‌కాలనీలో కొద్దిరోజులుగా నీటికి ఇబ్బంది పడుతుండడంతో ప్రజలు తమ సొంత ఖర్చుతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నారు. వేంపల్లెలో నీటికి కటకట అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి కథనంలో ప్రచురితమైంది. నీటి సమస్య పరిష్కారం కోసం టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర తన సొంత ఖర్చుతో ఆదివారం రాజీవ్‌కాలనీకి రెండు, రెడ్డయ్య కాలనీకి రెండు నీటి ట్యాంకర్లను ఏర్పాటుచేశారు.



మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

కడప(వినాయకనగర్), మార్చి16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని తాసా మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సభాభవనంలో ఆదివారం జరిగిన మాజీ సైనికుల మెగా క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీహెచ్ కార్డులు, క్యాంటీన్ కార్డులు పెన్షన్‌కు సంబంధించిన విషయాల మీద అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.క్యాంపు, బ్యాంకు, స్పర్శ్ తదితర స్టాల్స్‌ను సందర్శించారు. సైనిక పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఫిలిప్,అధికారులు వెంకటరెడ్డి, రజాక్‌ఖాన్, జార్జి మాజీ సైనికులు పాల్గొన్నారు.

పేదల ఫ్రిజ్ చల్లగా.. ఆరోగ్యంగా









పేదల ఫ్రిజ్‌గా చెప్పుకునే మట్టి కుండలకు వేసవి కాలం రావడంతో వాటికి గిరాకీ విపరీతంగా పెరిగింది. పేద, మధ్యతరగతి వారు కాకుండా ఉన్నత వర్గాల వారు, వ్యాపార వేత్తలు, అనేక కార్యాలయాల్లో వీటిని ఉపయోగించడం సర్వ సాధారణం. వంద రూపాయలు మొదలుకుని 500 రూపాయల వరకు కుండలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. నల్లకుండలు (కడప), ఎర్ర కుండలు (హైదరాబాదు), కూజాలు బానలు తదితరాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వాటి కోసం ప్రజలు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు.

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

నాటకరచనలో నిపుణుడు సుబ్బరాయకవి



నివాళులర్పిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక సాంఘిక నాటకాలను నాటక రచనలో రాయడంలో సిద్ధహస్తుడుగా సుబ్బరాయకవి ప్రసిద్ధిగాంచారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సుబ్బరాయకవి సంస్మరణ సభ నిర్వహించారు. రచయితల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సీపీ రమణారెడ్డి, జీవీ సాయి ప్రసాద్, కోడూరు స్వతంత్ర బాబు, రాజారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



ఎస్.ఎండీ మహబూబ్‌బాషా

కడప కలెక్టరేట్, మార్చి16(ఆంధ్ర జ్యోతి): ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని గుంటూరులో ఆదివారం ఆసంఘ కార్యాలయంలో ఏక గ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజా వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం రిజిష్టర్ 3194 ఆధ్వర్యంలో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఆస్కార్ రావు, రాష్ట్ర సెక్రటరీ జె.ఆహరోన్, రాష్ట్ర బాడీ, జిల్లా బాడీల అధ్యక్షులు, సెక్రటరీల అధ్యక్షతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడుగా వై.శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యదర్శిగా ఎస్ఎండీ మహబూబ్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికైన సభ్యులను సత్కరించారు.

నిత్యావసరాలు పంపిణీ

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కడపలోని కాగితాల పెంటలో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని లజనతుల్ ఉలమా వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ మౌల్వీ ఖాజీ షేక్ మొహమ్మద్ అలీ రషదీ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ హాఫీజ్ సయ్యద్ అస్గర్ అలా సాహెబ్, ట్రెజరర్ హాఫీజ్ నూరుల్లా సాబ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కబ్జాదారులకు వంతపాడుతున్న అధికారులు'

కడప నాగరాజుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో కబ్జారాయుళ్లకు వంతపాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నీటిమునక భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని దళితఫోరం నేత బూసిపాటి కిశోర్ ఆరోపించారు. కడపలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నచౌక్ పరిధిలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా సర్వేనెంబర్ 955లో గల 23 సెంట్లు భూమిని యథేచ్చగా కబ్జాదారులు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారన్నారు. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో నీటి మునక భూమిగా రిజిస్ట్రేషన్ అయిందన్నారు.ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు స్పష్టంగా ఇదివరకే ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ఈ భూమిని కబ్జా చేశారన్నారు.

జగనన్నకాలనీ అక్రమాలను వెలికితీయాలి

కడప మారుతీనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మండలం ముక్కుండలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్నకాలనీలో జరిగిన పలు అక్రమాలు వెలికి తీయాలని ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు విలియం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద పేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు నిర్మించారని అన్నారు. ఆ మేరకు మైదుకూరు మున్సిపాలిటీ పూర్వ మెప్మా టీఈ ఆప్షన్ 3 కింద గృహ నిర్మాణాన్ని అవకాశంగా తీసుకుని అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. డ్వాక్రాసంఘ మహిళా సభ్యుల వాటా ధనంగా 35లక్షలను దోచుకునేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు దొరబాబు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధులలో గ్లకోమా తీవ్రతరమైనదని, గ్లకోమా సోకితే అంధత్వం సంభవించే ప్రమాదం ఉందని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు గ్లకోమా కన్సల్టెంట్ ఆప్తాలమిస్ట్ శశిబిందు తిప్పన తెలిపారు. ప్రజల్లో అవాహన పెంచేందుకు ఆదివారం గ్లకోమా అవగాహన వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత బి.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'చల్ల'గా చూడమ్మా

చెన్నూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జాతర సమీపిస్తున్న నేపథ్యంలో చెన్నూరు కొత్తరోడ్డు లోని లక్ష్మీనగర్. సరస్వతీనగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల మధ్య ఉన్న ఆశ్రమం వద్ద ఆదివారం ఉదయం నడివీధి గంగమ్మకు ఆ ప్రాంత ప్రజలు చల్ల పోశారు. అలాగే చల్ల తీసుకుని మమ్మల్ని చల్లగా చూడమ్మా అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ప్రతి యేటా జాతర జరిగే ముందు ఆదివారం ఇలా చల్ల పోయడం ఆనవాయితీగా వస్తుంది. తెల్లవారుజాము నుంచి మహిళలు తమ ఇళ్లనుంచి చల్లను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అదే చల్లను ప్రసాదంగా స్వీకరించారు.

ఎస్సీల స్థలాలు ఆక్రమించడం దుర్మార్గం

కమలాపురం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబల్లె, కొత్తపల్లె ఎస్సీ కాలనీ దళితులకు డి.పట్టాలు ఇచ్చిన స్థలాల్లో గ్రామ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకులు తిరుపాల్, ఓబుల్‌రెడ్డి ఆక్రమించడం అన్యాయమని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కొత్తపల్లె గ్రామంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. తక్షణం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీకేదిన్నె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు సీకే దిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప-రాయచోటి జాతీయ రహదారిలో జమాల్‌పల్లి సమీపంలోని పెట్రోలు బంకు సమీపం వద్ద రాయచోటి వైపు వెళుతూ చెడిపోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఆదివారం తెల్లవారుజామున ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో షేక్ అహ్మద్, హారీఫ్, అబ్దుల్లాగౌస్ అనే ముగ్గురికి గాయాలయ్యాయని, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన 108 వాహనంలో రిమ్స్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE ADDITONAL SENIOR CIVIL JUDGE, KADAPA.
I.A. No....../2025 I.P. No. 10/2025

Shaik Dasthagiry, age 42 years, S/o Shaik Kareem, D.No. 1/130-3, Aadhar Card No. 7640 7070 4196, Occ. Chicken Centre, Santha Kowuru Village, Thonduru Mandal, Kadapa District, Cell No. 7013216306. - Petitioner/Debtor.

And

1) Shaik Khalandar, aged about 16 years, S/o Shaik Shukurulla, Muslim Mutton Shop, D.No. 19, Tekkayachenu Street, Jammalamadugu Town & Mandal, Kadapa Dist. Cell Not known.
2) Syed Ameer Basha, age 45 years, S/o Syed Mabu, Caste Muslim, Occ.Business, D.No.14/34m, Muchala Street, Jammalamadugu town & Mandal, Kadapa District, Cell : 703221213,
3) Mula Mabu, aged 55 years, S/o Mulla Mastan, Caste : Muslim, Occ. Business, R/o 1/130-4, Santha Kovvuru Village, Thondur Mandal, Kadapa District, Cell No. not known,
4) Syed Beeebe aged about 60 years, W/o Syed Mabu, Muslim Occ. House Wife, D.No. 19/74, Tekkayachenu Street, Jammalamadugu Town & Mandal, Kadapa Dist. Cell Not known.
5) Kattubadi Minnela Shareef, age 58 years, S/o Minenela, Muslim, Occ. Business, R/o 12/78, Marvadi Street, Jammanalamadugu town & Mandal, Kadapa District, Cell No. Not known.
6) S.B. Nazeer, age 52 years S/o S.B. Basheer Ahammed, Muslim, Occ. Business, R/o 12/80, Marvadi Street, Jammalamadugu town & Mandal, Kadapa District, Cell No. Not known,
7) Shaik Noorjahan, age 36 years, C/o Syed Rakeebulla Muslim, Occ. House Wife, R/o 1/23 Santhakovvuru Village, Thonduru Mandal, Kadapa District, Cell No. 7815887135,
8) Shaik Baba Fakruddin, age 45 years, S/o Fakruddin, Muslim, D.No. 1/22, Santhakovvuru Village, Thonduru Mandal, Kadapa District, Cell No. 9949999625,
9) Kothapalli Surya Narayana @ Surya S/o Kothapalli Subramanyam, aged about 40 years, Hindu, Occ. Running Steel Shop, R/o D.No. 14/130, Muchala street, Jammalamadugu town & Mdl, Kadapa Dt. Cell No. Not known.
10) Cuddapah Nazeer Ahammed @ C. Nazeer Ahammed S/o Cuddapah Basheer, aged about 56 years, Caste : Muslim, Occ. Textile Cloth Showroom, D.No.12/30, Gadda Street, Jammalamadugu town & Md, Kadapa Dt., Cell Not. Known. - Respondents/Creditors.

NOTICE

Whereas the petitioner filed the insolvency petition before the Hon'ble Addl. Senior Civil Judge, Kadapa and the same is posted for the appearance of respondents on 3-4-2025. You are hreeby directed to appear before the Hon'ble Court at 10.30 AM in person or through your counsel otherwise the petition may be debited in your absence.

BY ORDER OF THE COURT
Dr. J. PRABHAKAR, Advocate for Petitioner / Debtor

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేస్తూ జీఓ 85ను జారీచేయడం చారిత్రాత్మక తప్పిదమని ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు అవుతున్నా ఆ జీఓను రద్దుచేయక పోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పులివెందుల రూరల్..: అమరజీవి పొట్టిశ్రీరాములుకు పులివెందులలో ఘన నివాళులు అర్పించారు. ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప కలెక్టరేట్..: ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం తన ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగాలు నేటి తరానికి ఆదర్శనీయమని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ కొనియాడారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పుష్ప గుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సమన్వయ కర్త బండి జకరయ్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు పీడీ. సజయ్ కాంత్, గౌరీ దేవి, ఓబీసీ జిల్లా చైర్మెన్ చిన్నకుళ్లాయప్ప,రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి కమాల్ బాష, జహరార్,శీలం గంగయ్య,దినకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు నిర్మించరా..?

● దశాబ్దాలు గడిచినా రోడ్లపైనే చెత్తపడవేసి నిప్పు పెట్టడంతో దట్టమైన పొగలు ● ఇబ్బందులు పడుతున్న ఎర్రగుంట్ల నగరవాసులు

ఎర్రగుంట్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లనగరపంచాయతికి డంపింగ్ యార్డు ఒక కలగా మిగిలిపోయింది. జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయతిగా ఉన్న ఎర్రగుంట్ల 2012లో నగరపంచాయతిగా మారింది. అప్పటి వరకు అరకొర సిబ్బందితో, చాలిచాలని నిధులతో ఇబ్బందిగా ఉండేది. అయితే నగరపంచాయతి నుంచి రకరకాలుగా నిధులు రావడంతోపాటు సుమారు వంద మంది వరకు శాశ్విత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు నగర పంచాయతిలో పనిచేస్తున్నారు. అయినా డంపింగ్ యార్డుకు మాత్రం మోక్షం రాలేదు. 2015లో పెద్దనపాడు వద్ద డంపింగ్ యార్డును అప్పటి కలెక్టర్ మంజూరు చేశారు. అయితే అక్కడి ప్రజలు అభ్యంతరం పెట్టడం, కోర్టుకు వెళ్లడంతో అది రద్దయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్థల అన్వేషణ జరుగుతూనే ఉంది. గత సంవత్సరం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి సొంతనిధులు ఇస్తానని స్థలం చూసుకోవాలని హామీ ఇచ్చారు. అప్పటి వైసీపీ పాలకులు స్థలాన్వేషణలో రాజకీయం చేశారే కాని స్థలం మాత్రం కొనలేదు. దీంతో వైసీపీ ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోయింది. నగరపంచాయతి వద్ద నిధుల్లేవు. దీంతో డంపింగ్ యార్డుకోసం చేసే ప్రయత్నాలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే వుంది.

దట్టమైన పొగలతో ఇబ్బందులు పడుతున్న జనం

నగరపంచాయతీలో సేకరించిన చెత్తనంతా కడపరోడ్డు జువారీ రైల్వే కట్టవెంబడి వేస్తూ నిప్పు పెట్టడంతో భారీగా పొగ నిండుకుంటోంది. ఈ పొగ వల్ల ఊపిరితిత్తుల సమస్య వస్తోందని సమీప ప్రాంతాల వారు ఫిర్యాదులు చేస్తున్నారు. అలాగే సాయంత్రం, రాతివేళల్లో ఎన్‌హెచ్ రోడ్డంతా పొగతో నిండుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బందికలగడంతోపాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. గనుల సమీపంలో తక్కువ ధరలకు ఇచ్చే భూములుండడంతోపాటు ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా పట్టించుకునే వారులేరు. . ప్రొద్దుటూరురోడ్డు, హనుమనగుత్తి రోడ్లలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకునే అవకాశం లేదు. ఎందుకంటే అక్కడ భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అదీకాక వ్యవసాయ భూముల రైతులు, వాటిని డంపింగ్ యార్డుకు ఇవ్వరు. ప్రస్తు ప్రభుత్వం ఎర్రగుంట్లకు డంపింగ్‌యార్డు మంజూరు చేస్తే ఎర్రగుంట్ల ప్రజలకు సమస్యలుండవు.



రోడ్డు పక్కనే చెత్తకుప్ప నుంచి దట్టంగా అలుముకుంటున్న పొగలు

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఎర్రగుంట్లలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు 15ఎకరాల భూమి కావాల్సి ఉంది. ఇందు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. అందుకు రూ.3.5కోట్లు నిధులు కావాల్సి ఉంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు మెటీరియల్ రికవరి స్పెషలిటి కోసం 15ఎకరాలు కావాలని ప్రతిపాదనలు ఇచ్చాం. ప్రభుత్వ స్థలాలులేవు. ప్రైవేటు స్థలాల కోసం రాశాం. ఎంఎల్‌ఏ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

-పేర్లి శేషఫణి, కమిషనర్, ఎర్రగుంట్లనగరపంచాయతీ

గుండె వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

ప్రొద్దుటూరు , మార్చి 16(ఆంధ్రజ్యోతి) : గుండె వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని సకాలంలో పరీక్షలు నిర్వహించుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పాత కోట శ్రీనాధ్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులో ఉచిత గుండె కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినెల మూడవ ఆదివారం ఉచితంగా గుండె కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఈసీజీ స్కానింగ్ నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 43 మంది గుండె పరీక్షలు నిర్వహించగా వారిలో 19 మంది ఉచితంగా ఈసీజీ, 7 మందికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. డాక్టర్‌హరిత ఆధ్వర్యంలో 32 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పీ4 విధానంపై అభిప్రాయాలు తెలపండి

పోరుమామిళ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో పీ4 చేపట్టనున్న కార్యక్రమంపై ప్రజలు అభిప్రాయం తెలపాలని ఎంపీడీవో రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంపన్న కుటుంబాలు, వెనుకబడిన 20శాతం పేద కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శకం చేసి ఆర్థికంగా ఉద్యోగపరంగా వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం సమన్వయకర్తగా పీ4 కార్యక్రమం చేపడుతుందన్నారు. స్వర్ణాంధ్ర ఏపీవీవో ఈఇన్‌వెబ్‌సైట్‌లో అభిప్రాయాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ క్యూర్ కోడ్‌లో అభిప్రాయాలు తెలపవచ్చన్నారు.

ఆశావర్కర్ల వేతనాల పెంపుపై జీవో విడుదల చేయాలి

ఎర్రగుంట్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల వేతనాల పెంపు జీవోను వెంటనే విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర అద్యక్షురాలు పి.సుభాషిని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎర్రగుంట్లలో జరిగిన సమావేశంలో ఆమె మాటాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు ప్రకటించిన వేతనాలపుంపు, గ్యాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచినట్లు మంత్రి నడ్డా రాజ్యసభలో ప్రకటించారని, దానికి సంబందించిన జీవోను వెంటనే విడుదల చేస్తే ఆశావర్కర్స్‌కు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, మరియమ్మ, సుబ్బారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ఎర్రగుంట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని భవన నిర్మాణ సంఘం నాయకులు కోరారు. ఆదివారం ఎర్రగుంట్లలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సంక్షేమ బోర్డు ద్వారా 12 రకాల సంక్షేమ పథకాలే కాక పనిముట్లు కూడా ఇస్తామన్నారని అయితే ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు నిధులు మాయమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాక్రిష్ణ, రవికుమార్, శ్రీనివాసులు, దానం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.







గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం

బి.కోడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూతనంగా గృహ నిర్మాణాలను చేపట్టే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం చేస్తుందని ఎంపీడీవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహాలు మంజూరై అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రుణాన్ని అందిస్తుందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, అత్యంత వెనుకబడిన గిరిజనులకు లక్ష రూపాయలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గతంలో లక్షా 80వేలు ఇచ్చే గృహ నిర్మాణ ఖర్చుకు అదనంగా ఈ మొత్తాన్ని అందిస్తుందని అర్హులైన లబ్ధిదారులు సంబంధిత సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంటును సంప్రదించాలని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబీకులకు పరామర్శ

దువ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం రామాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హరి అనే వ్యక్తి కుటుంబీకులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం పరామర్శించారు. మృతుని పిల్లలను మంచి పాఠశాలలో చేర్పించి చదివించేందుకు సహకరిస్తామని చెప్పారు. కుటుంబీకులను ఎమ్మెల్యే ఓదార్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఆ పార్టీ నాయకులు పి.వెంకటసుబ్బయ్య, చింతకుంట హుస్సేన్‌సా, రఘునాథనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ తిరునాళ్లు

పోరుమామిళ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కోట పోలేరమ్మ తిరునాల ఆదివారం ఘనంగా జరిగింది. రంపాడు వీధిలో వెలసిన కోట పోలేరమ్మ తిరుణాల చివరి రోజు కోటపోలేరమ్మ పుట్టినిల్లు అయిన బలిజ కోట వీధి నుంచి బోనాలు, కుంకుమ బండ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుదాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. .కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్‌తో పాటు పోరుమామిళ్లలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

భక్తి, శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

బద్వేలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్యాగరాజు కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి, త్యాగరాజస్వామి, పోలేరమ్మ, శారద దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని లైటుపాళెం సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పాఠ్యపుస్తకాల్లో పొట్టిశ్రీరాములు జీవిత చరిత్ర పాఠ్యాంశం ఉండేదని, ఆ తర్వాత తొలగించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రమణ్యం, కోశాధికారి మిట్టా శంకర్, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు

బద్వేలులో: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీ సుబ్బారావు అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నాగరాజు, ఆవోపా అధ్యక్షుడు నూకల రెడ్డెయ్య, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవ తి లలిత, స్టేట్ మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, సెక్రటరీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, ఆవోపా సంఘం ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విశ్వనాధుల ప్రసాద్, యాదాల సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు ఓబయ్య గుప్త, తులసి సుధాకర్, కొప్పరపు గురు ప్రసాద్ పాల్గొన్నారు.

అట్లూరులో: అట్లూరు గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సుధాకర్, పాఠకులు, విద్యార్థులు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు బిస్కట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్యం చేరుకోవాలి

జమ్మలమడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఐఏఎస్ స్టడీ సర్కిల్ మేనేజర్ డాక్టర్ లక్షమయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సహకారంతో ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపిక కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సివిల్స్ ఎంపికకు 50 మంది మహిళా అభ్యర్థులు హాజరుకాగా అందులో 15 మందిని ఎంపిక చేసినట్లు గొరిగెనూరు గ్రామానికి చెందిన కూటమి నాయకుడు నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ స్టడీ సర్కిల్ న్యూఢిల్లీ ఉపాధ్యాయులతోపాటు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కూటమి నేత గోనా పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్షుమయ్య

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పాటు

బద్వేలుటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందించవచ్చని సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కళావతి అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆదివారం స్థానిక బిజివేముల వీరారెడ్డి కళాశాల ఆవరణలో సీఈఓ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మాత్స్‌స్పీడ్ ఐఐటి మాస్ట్రో 25 స్పోర్ట్స్ నిర్వహించారు. ఇందులో అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

జ్యోతి క్షేత్రంలో 'థ్యాంక్ యూ మంత్రి నారాలోకేశ్' కార్యక్రమం

కాశినాయన మార్చి16(ఆంధ్రజ్యోతి): కాశినాయన ఆశ్రమంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి కేకే చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కాశినాయన భక్తులు కలిసి థ్యాంక్‌యూ మంత్రి నారాలోకేశ్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్‌కు నూతన నిర్మాణాల వద్ద నిలబడి బ్యానర్లు చేతబట్టి థ్యాంక్‌యూ సార్ అంటూ హర్షం వ్యక్తంచేస్తూ ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు.ఈకార్యక్రమంలో టీడీపీ మండల బాధ్యుడు రాజారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు గురివిరెడ్డి, నాయకుడు హోండా రవీంద్రారెడ్డి, ఎంపీటీసీ రమణ, పోలిరెడ్డి, నరసింహారెడ్డి, క్రిష్ణారెడ్డి, జయరామిరెడ్డి, పిరవీంద్రారెడ్డి, రమణారెడ్డి, రోహిత్ రెడ్డి, ప్రదాన అర్చకుడు జీరయ్యస్వామి పలువురు కాశినాయన భక్తులు పాల్గొన్నారు.



వక్ఫ్‌బోర్డు రాష్ట్ర సభ్యుడు జాకీర్ అహమ్మద్‌కు సన్మానం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యునిగా నియమితులైన బేపారి జాకీర్ అహ్మద్‌ను ప్రొద్దుటూరు బార్ కౌన్సిల్ ముస్లిం న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ముస్లిం కమ్యూనిటీ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లిం న్యాయవాదులు దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తనను వక్ఫ్‌బోర్డు సభ్యునిగా నియమించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు దాదాపీర్, జిలానీబాష, అబీద్ హుస్సేన్, లాలూసాహెబ్, నూరుల్లా, షకిల్, పిరోజ్, కరిముల్లాబేగ్, రహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో 75 కేంద్రాల్లో పది పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 75 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈనెల 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. పరీక్షలను పురస్కరించుకుని ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని 18 మండలాల్లో 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,678 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రొద్దుటూరు మండలంలో 23 పరీక్షా కేంద్రాల్లో 3,770 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తుతోపాటు 144వ సెక్షన్ విధించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంలో ఏఎన్ఎంలను నియమించారు. ఉదయం 8 గంటలలకు ఇన్విజిలేటర్లు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షా కేంద్రాల చీఫ్ వద్ద మినహా సెల్‌ఫోన్ ఎవరి వద్ద ఉండరాదని సూచించారు. ఎవరివద్దనైనా సెల్‌ఫోన్లు ఉంటే సస్పెండ్ చేస్తామని ఆర్‌జేడీ శ్యామూల్ హెచ్చరించారు. కాగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు డెస్కులు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు.



అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్లో హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న దృశ్యం

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం

పరీక్షలకు సంబందించి పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈవో సావిత్రమ్మ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా ఉపాధ్యాయులకు ఇన్విజిలేటర్ విధులు కేటాయించామన్నారు..

ముద్దనూరులో:మండల కేంద్రంలో సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు బాలుర, బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నాగేశ్వరనాయక్ తెలిపారు. 5ప్రభుత్వ పాఠశాలలు,4 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 141మంది, బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 151 మంది,మొత్తం 292 మందివిద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పద్మలత తెలిపారు. మైదుకూరులో తొమ్మిది సెంటర్లలో బాలురు 612 మంది, బాలికలు 627 మంది పరీక్షలు రాస్తున్నట్లు ఆమె తెలిపారు.

బ్రహ్మంగారిమఠంలో : మండలంలో పది పరీక్షలకు 418 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎంఈవో పుల్లయ్య తెలిపారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. జిరాక్స్ సెంటర్లు పరీక్ష ముగిసేవరకు మూసివేయాలని ఎంఈవో తెలిపారు.

కొండాపురంలో: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదవతరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ఈ ఏడాది 458 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో రామయ్య తెలిపారు. గురుకుల పాఠశాల సెంటర్‌లో 213 మంది, కొండాపురం జడ్పీ హైస్కూల్‌లో 94 మంది, శివసాయి హైస్కూల్‌లో 151 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కొండాపురం జడ్పీ హైస్కూల్ కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు.

దువ్వూరులో: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి పద్మలత తెలిపారు. దువ్వూరు జడ్పీ హైస్కూలులో 180 మంది విద్యార్థులు, పుల్లారెడ్డిపేట హైస్కూలులో 186 మంది, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో 96 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 244 మంది ఇన్విజిలేటర్లు, మరో 6 మంది ఆపైన పరిశీలకులు ఉంటారని చెప్పారు.

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం 17 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఎంఈవో రవిశంకర్ పేర్కొన్నారు. ఈనెల 17నుంచి 31 వరకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల కోసం ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఎర్రగుంట్లలో: మండలంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఎర్రగుంట్ల నగర పంచాయతిలోని బాలుర హైస్కూల్‌లో 240 మంది, బాలికల హైస్కూల్‌లో 240 మంది, రాణీవనంలో 150 మంది, సెయింట్‌థామస్ హైస్కూల్ 150 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఎప్పుడు మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లుగా విమర్శలున్న చిలమకూరులో ఉన్న సి సెంటర్‌ను ఈసారి రద్దు చేశారు. ఆదివారం మధ్యాహ్నానికి అన్ని సెంటర్స్‌లో నెంబర్లు వేసి సిద్ధం చేశారు. సిట్టింగ్ స్క్వాడ్‌తోపాటు, ఫ్లైయింగ్ స్క్వాడ్ కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

మైలవరంలో: మండలంలో సోమవారం నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో చిట్టిబాబు ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 457 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఇందుకోసం మైలవరంలోని జడ్పీ హైస్కూలు, గురుకుల బాలికల పాఠశాలలో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

మండల పరిధిలోని వేపరాల జడ్పీ హైస్కూలులో 10వ తరగతి విద్యార్థులకు అమృత హస్తం సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యాసామిగ్రి పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు బాలయ్య తెలిపారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు ఫ్రీ బస్సు సర్వీసు

బద్వేలు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు బస్సు పాస్ లేకపోయినా పరీక్ష హాల్‌టికెట్ ఉంటే ఉచితంగా పల్లెవెలుగు, అల్ట్రాపల్లె వెలుగు సర్వీసులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 31 వరకు పది పరీక్షలు జరుగుతాయని అంత వరకు వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. బస్సు డ్రైవరు, కండక్టర్లకు కూడా విద్యార్థుల సమయానుకూలంగా బస్సును నడపాలని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

పార్కుల ఏర్పాటుపై దృష్టిసారించిన కమిషనర్

బద్వేలుటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ సుందరీకరణలో భాగంగా పార్కులపై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఆదివారం కమిషనర్ తన సిబ్బందితో కలసి ఎన్జీఓ కాలనీలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 96సెంట్ల ప్రభుత్వ స్థలంలో పార్కు నిర్మాణం కోసం కొలతలు వేసి ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే బద్వేలు మున్సిపాలిటీ ఆహ్లాదకర మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రణాళికా బద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అర్బన్ గ్రీనింగ్ కార్పొరేషన్ వారికి మున్సిపాలిటీలోని ఎన్జీఓ కాలనీలో పార్కుకు, మైదుకూరురోడ్డు నందిపల్లె సమీపంలో ఉన్న సగిలేరు బ్రిడ్జి వద్ద రెండు వైపుల బ్యూటిఫికేషన్, కోటవీధిలోని పాత ప్రభుత్వాసుపత్రిలో ఒకటిన్నర ఎకరాలో పార్కు, వాకింగ్ ట్రాక్, చెన్నంపల్లె వద్ద ఆలయం వెనుకవైపు 1.50 ఎకరాల్లో పార్కు, వాకింగ్ ట్రాక్, నాగులచెరువు వద్ద బ్యూటిఫికేషన్ వాకింగ్‌ట్రాక్, రూపరాంపేట శివాలయం వద్ద ఉన్న కుంటవద్ద బ్యూటిఫికేషన్ ఇలా 6చోట్ల పార్కుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడాలని ఆయన పట్టణ ప్రజలను కోరారు.



పార్కు నిర్మాణం కొరకు కొలతలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలులో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

బద్వేలు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రధాన పట్టణమైన బద్వేలుకు గోపవరం, అట్లూరు, బద్వేలు గ్రామీణ ప్రాంత ప్రజలు నిత్యం ఏదోక పనిపై వచ్చి పోతుంటారని, ప్రధాన రహదారుల్లో ఎక్కడా కూడా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్, బ్రహ్మయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూవోపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్‌ను ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులోని ఎన్జీవో హోంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం నాగులకట్ట వసతి గృహంలో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న పర్యవేక్షణ అధికారిగా ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్ నిర్లక్ష్యం స్పష్టంగా ఉందన్నారు. అలాగే అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయాన్ని జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు తరలించాలనుకోవడం మానుకోవాలని తరలిస్తే ఉద్యమం తప్పద ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, ఎల్.క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.